

రత్నగిరిపై డిజిడల్

అన్నవరం దేవస్థానంలో ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ల సౌకర్యం లేకపోవడంతో నిత్యం ఆలయానికి వేలాదిగా వస్తున్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. - 8లో



దర్యాప్తు ముమ్మరం

తుని మండలం తేటగుంట శివారు ఎర్ర కోనేరు జంక్షన్‌లో మహిళ హత్య, ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం కేసులపై ముమ్మర దర్యాప్తునకు ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. - 8లో

సముద్రంలోకి 51,268 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 51,268 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

'వానా'వరణం



వానజల్లుల్లో కొవ్వూరు పట్టణం


కొవ్వూరు: మళ్లీ ముసురు పట్టింది. జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో జనజీవనం స్తంభించింది. అధిక శాతం జనాలు ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్ల పక్కన చిరు వ్యాపారులపై వర్షం ప్రభావం చూపించింది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ముగిసిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 6.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచిస్తోంది. గోపాలపురం, గోకవరంలో 10.4 మిల్లీమీటర్లు, తాళ్లపూడి 10.2, నల్లజర్ల 9.6, దేవరపల్లి 8.8, కొవ్వూరు 9.2, చాగల్లు 8.6, కోరుకొండ 8.2, రాజమహేంద్రవరం అర్బన్ 7.4, రాజమహేంద్రవరం రూరల్ 5.4, రాజానగరం 4.4, రంగంపేట 3.2, బిక్కవోలు 4.2, అనపర్తి 5.2, నిడదవోలు 3.6, కడియం 4.2, సీతానగరంలో 7.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యాన వయోవృద్ధుల కోసం నిర్వహిస్తున్న సంస్థలు, ఓల్డేజ్ హోమ్స్ నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. సంబంధిత సర్టిఫికెట్‌ను విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ లేకుండా ఓల్డేజ్ హోమ్‌లు నిర్వహించడం నేరమని స్పష్టం చేశారు. తమ తనిఖీల్లో అలాంటి వాటిని గుర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంబంధిత సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులను కాకినాడ సాంబమూర్తినగర్‌లోని వయోవృద్ధుల సంక్షేమ శాఖ వద్ద సమర్పించాలని తెలిపారు.

పవర్ డ్రాప్

- విద్యుత్ వినియోగంపై నైరుతి ఎఫెక్ట్
- వాతావరణం చల్లబడటంతో తగ్గిన వినియోగం
- పక్షం రోజుల్లో 280 ఎంయూలే వాడకం
- నాలుగు నెలలుగా 500 నుంచి 550 ఎంయూలు
- నెలాఖరుకు 150 ఎంయూకు తగ్గుతుందని అంచనా



సాక్షి ప్రతినిధి, కాకినాడ: నిన్న మొన్నటి వరకూ మండిపోయిన ఎండలు, వడగాడ్పులకు తాళలేక వినియోగదారులు ఎడాపెడా విద్యుత్ వాడేశారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు 24/7 వినియోగించినా ఉపశమనం లభించక నరకయాతన పడ్డారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇబ్బడిముబ్బడిగా విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో ఆ మేరకు బిల్లులు కూడా వినియోగదారుల గుండెల్ని గుభేల్‌మనిపించాయి. అటువంటిది జూన్ నెలాఖరు వచ్చేసరికి నైరుతి ప్రవేశంతో వాతావరణం చల్లబడింది. ఫలితంగా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం తగ్గింది. దీంతో విద్యుత్ డిమాండ్ కూడా తగ్గింది. జూలై వచ్చేసరికి మరింత తగ్గుదల నమోదైంది.

నాలుగు నెలలు డేంజర్ బెల్స్

ఈ ఏడాది వేసవి మొత్తం నాలుగు నెలలు డేంజర్ బెల్స్ మోగించింది. మార్చిలో ఎండలు మొదలయ్యాయి. జూన్ నెలాఖరు వరకూ ఎక్కడా తగ్గేదే లే.. అన్నట్టుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఒక్క మే నెలలోనే అధికారులే ఊహించని రీతిలో విద్యుత్ వినియోగం నమోదైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మొత్తం మీద విద్యుత్ వినియోగంలో కాకినాడ డివిజన్ 202 మిలియన్ యూనిట్ల(ఎంయూ)తో అగ్రస్థానంలో నిలిచింది. 110 ఎంయూల వినియోగంతో రాజమహేంద్రవరం, 104 ఎంయూలతో అమలాపురం డివిజన్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో మామూలుగా రూ.600 నుంచి రూ.800 వచ్చిన నెలవారీ విద్యుత్ బిల్లు ఏకంగా రూ.2 వేలు, రూ.3 వేలకు పైగా పెరిగిపోయింది. ప్రస్తుతం వాతావరణం చల్లబడి, విద్యుత్ వినియోగం తగ్గడంతో ఈసారి వచ్చే బిల్లులు తగ్గే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

మొత్తం వినియోగదారులు	19,27,679
గృహ వినియోగదారులు	16,32,042
కేటగిరీ–2	1,90,302
వ్యవసాయ కనెక్షన్లు	51,605
ఆక్వా కనెక్షన్లు	10,002
పరిశ్రమలు	6,324
వీధి దీపాలు	37,304

జూన్‌లో రికార్డు స్థాయి వినియోగం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వేసవి మొత్తం చూసుకుంటే.. జూన్ నెలలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో ఏకంగా 613.27 ఎంయూల బెంచ్ మార్క్‌ను దాటేసింది. గత ఏప్రిల్ నుంచి సరాసరి రోజుకు 20 నుంచి 23 ఎంయూల విద్యుత్ వినియోగం జరిగింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా అంతా కలిపితే రోజుకు సగటున 20 ఎంయూల విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇది క్రమంగా తగ్గుతూ రానున్న రోజుల్లో రోజుకు 17 లేదా 18 ఎంయూలకు మించి ఉండదని చెబుతున్నారు. ఎండలు తగ్గి వాతావరణం చల్లబడటంతో ప్రస్తుత నెలలో సగం రోజుల వినియోగం 280 మిలియన్ యూనిట్లు ఉంది. ఈ నెలలో మిగిలిన 15 రోజులూ వాతావరణం మరింత చల్లబడుతుందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో వినియోగం ఇంతకంటే తక్కువగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెలాఖరుకు వినియోగం 150 ఎంయూలే ఉండవచ్చని విద్యుత్ అధికారులు భావిస్తున్నారు. అంటే ఈ నెల మొత్తం 430 ఎంయూల విద్యుత్ మాత్రమే వినియోగమయ్యే అవకాశం ఉంది. వేసవిలో నమోదైన నెలవారీ వినియోగంతో పోలిస్తే ఇక నుంచి నెలవారీ కనీసం 150 నుంచి 170 మిలియన్ యూనిట్ల వినియోగం తగ్గుతుందని ఏపీ ఈపీడీసీఎల్ అంచనా వేస్తోంది. ఆగస్టు వచ్చేసరికి ఇది మరింత తగ్గనుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విద్యుత్ వినియోగం వివరాలు

నెల	వినియోగం ఎంయూ	ఒక రోజు గరిష్ట వినియోగం (ఎంయూ)	బిల్లు డిమాండ్ (రూ.కోట్లలో)	వసూళ్లు (రూ.కోట్లలో)
ఏప్రిల్	559.14	20.46	289.50	260.00
మే	577.79	23.03	372.12	299.34
జూన్	613.27	23.03	397.82	376.79

వినియోగం మరింత తగ్గుతుంది



వేసవిలో రోజూ సగటున 22 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండేది. ప్రస్తుతం వర్షాలు కురుస్తూండటంతో వినియోగం తగ్గింది. ముఖ్యంగా గృహ విద్యుత్ వినియోగం బాగా తగ్గింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంతటా కలిసి 18 మిలియన్ యూనిట్లు వినియోగిస్తున్నారు. శీతాకాలం వచ్చేసరికి ఇది 14 మిలియన్ యూనిట్లకు తగ్గుతుందని అంచనా వేస్తున్నాం.

–టీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ, ఏపీ ఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం సర్కిల్

వినియోగం తగ్గింది



వర్షాలతో వాతావరణం చల్లబడి విద్యుత్ వినియోగం తగ్గిపోయింది. ఎండ తీవ్రతతో జూన్ నెలాఖరు వరకూ రాత్రి, పగలు తేడా లేకుండా ఇంట్లో ఏసీ, ఫ్యాన్లు తిరుగుతూనే ఉండేవి. అయినప్పటికీ ఎండ తీవ్రత తట్టుకోవడం చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు వాతావరణం బాగా చల్లబడటంతో ఏసీలు స్విచ్ ఆఫ్ చేశాం. కరెంటు బిల్లు కూడా ఆదా అవుతుంది.

– జతిన్ షెలత్, బీమా కంపెనీ మేనేజర్, రాజమహేంద్రవరం

ఉమ్మడి జిల్లాలో ఏపీ ఈపీడీసీఎల్ డివిజన్ల వారీగా విద్యుత్ వినియోగం (ఎంయూలలో)

కాకినాడ	202
రాజమహేంద్రవరం	110
అమలాపురం	104
రామచంద్రపురం	80
జగ్గంపేట	66
రంపచోడవరం	10

పేదలకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: జగనన్న సురక్ష శిబిరాల్లో పేదలకు రూపాయి ఖర్చు లేకుండా అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలూ అందిస్తున్నామని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని 13, 15 వార్డుల ప్రజల కోసం స్థానిక ఎన్‌జీవో హోంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒక్కొక్కరి సమస్య అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. 11 సేవలకు సంబంధించి 673 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, కౌన్సిలర్లు అక్షయపాత్ర శ్రీనివాసరావు, అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): వచ్చే విద్యా సంవత్సరం(2024–25)లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత, పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, కడియం, రాజానగరం, రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాలకు చెందిన 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎటువంటి అంతరాయం లేకుండా ఐదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తుకు వచ్చే నెల 10 చివరి తేదీ అని తెలిపారు. గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన విద్యార్థులు ఎటపాకలోని నవోదయ విద్యాలయకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

లెక్క.. పక్కాగా..



- 21 నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రారంభం
- నెల రోజుల పాటు ఇంటింటా సర్వే
- అక్టోబర్ 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన
- జగనన్న కాలనీలు పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉంటే ప్రత్యేక బూత్‌లు
- ఒకే డోర్ నంబర్‌తో 10కి పైగా ఓట్లు ఉంటే పరిశీలన

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ బూత్‌లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
అనపర్తి	228	1,06,023	1,09,573	0	2,15,596
రాజానగరం	216	1,02,046	1,03,844	10	2,05,900
రాజమహేంద్రవరం సిటీ	225	1,24,411	1,32,366	63	2,56,840
రాజమహేంద్రవరం రూరల్	263	1,25,155	1,30,624	17	2,55,796
కొవ్వూరు	174	86,382	90,653	8	1,77,043
నిడదవోలు	205	1,00,679	1,04,471	8	2,05,158
గోపాలపురం	248	1,15,869	1,18,733	9	2,34,611
మొత్తం	1,559	7,60,565	7,90,264	115	15,50,944

కొవ్వూరు: వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకూ బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తారు. అలాగే వచ్చే జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు వచ్చే వారందరికీ కూడా ఓట్లు నమోదు చేస్తారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 80.38 శాతం సరాసరి ఓటింగ్ నమోదైంది. ఇంతకంటే తక్కువ ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలను ఈ సర్వేలో గుర్తిస్తారు. అక్కడ ఓటింగ్ శాతం తగ్గడానికి కారణాలను నమోదు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణపై బూత్ లెవెల్ అధికారులకు ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ కె.మాధవీలత సైతం పలుమార్లు సమీక్ష నిర్వహించి, ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ పర్యవేక్షణకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. వీరికి ఆయా మండల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల అధికారులు సహకారం అందిస్తారు. ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల సంఘం గుర్తింపు రాజకీయ పార్టీల నాయకులకు సైతం అవగాహన కల్పించారు. తాజా లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 15,50,944 మంది ఓటర్లు ఉన్నారు.

సర్వేలో పరిశీలించే అంశాలివీ..

- ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్ల గుర్తింపు.
- చనిపోయిన వారి ఓట్ల తొలగింపు.
- వంద సంవత్సరాల వయస్సు పైబడిన వారి గుర్తింపు.
- డోర్ నంబర్లు లేకుండా ఉన్న, ఒకే డోర్ నంబర్‌తో పదుల సంఖ్యలో ఉన్న ఓట్లపై క్షేత్ర స్థాయి పరిశీలన.
- జిల్లాలో కొత్తగా ఏర్పాటైన జగనన్న కాలనీలకు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉంటే కొత్తగా ఆయా ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సిఫారసులు. దగ్గరలో పోలింగ్ కేంద్రాలుంటే వాటిల్లో ఆయా కాలనీల్లోని ఓట్ల విలీనం.
- సర్వీసు ఓటర్లు (మిలటరీ), ఎన్ఆర్‌ఐ ఓట్ల వివరాలను సరి చేయడం.
- దీర్ఘ కాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో కనుక్కొని అక్కడి జాబితాలో ఉంచడం.
- ఒక బూత్‌లో సరాసరి 1,500కు పైబడి ఓట్లు ఉంటే కొత్త బూత్ ఏర్పాటుకు సిఫారసు. అందుకు అనువైన ప్రదేశాల గుర్తింపు.
- పేర్లు, నియోజకవర్గాలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డుల్లో మార్పులు, చేర్పులు, తప్పొప్పులు సరి చేయడం.
- ఓటర్ల అభ్యర్థన మేరకు పోలింగ్ కేంద్రాలు, ఓట్లు ఒక చోటు నుంచి మరో చోటుకు మార్చడం.

ఇదీ షెడ్యూలు

- ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకూ ఇంటింటా బూత్ లెవెల్ అధికారుల సర్వే.
- వచ్చే నెల 22 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకూ పోలింగ్ స్టేషన్ల సర్దుబాటు, విభజన. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు 1,500 ఓట్లు ఉండేలా సర్దుబాటు. ఎక్కువ, తక్కువ ఉంటే సమీప పోలింగ్ స్టేషన్లలో కలపడం.
- గుర్తింపు కార్డులు, జాబితాల్లోని తప్పుల సవరణ.
- స్పష్టత లేని ఫొటోలు తొలగించి, మంచి ఫొటోల ఏర్పాటు. అనంతరం ఎన్నికల కమిషన్ ఆమోదానికి పంపించడం.
- సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకూ ఫాం–1 నుంచి 8 వరకూ పరిశీలన. అదనంగా పెరిగిన, తగ్గిన ఓటర్ల జాబితాల తయారీ.
- అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రకటన. దీనిపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ.
- రెండు ఆది, రెండు శనివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం.
- ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిములను డిసెంబర్ 26వ తేదీ నాటికి పరిష్కరించడం.
- వచ్చే ఏడాది జనవరి 1వ తేదీన సిద్ధం చేసిన ఓటర్ల జాబితాను ఆమోదానికి పంపించడం.
- జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రకటన.

నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారులు

కొవ్వూరు: ఎస్.మల్లిబాబు, ఆర్‌డీఓ, కొవ్వూరు
రాజమహేంద్రవరం రూరల్: ఎ.చైత్రవర్షిణి, ఆర్‌డీఓ, రాజమహేంద్రవరం
అనపర్తి: ఏబీవీఎస్పీ శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గెయిల్)
రాజానగరం: ఎస్.సరళావందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
నిడదవోలు: కె.గీతాంజలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కొవ్వూరు
గోపాలపురం: టీఈఎం రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఓఎన్‌జీసీ
రాజమహేంద్రవరం సిటీ: కె.దినేష్ కుమార్, కమిషనర్, నగరపాలక సంస్థ

పారదర్శకంగా తయారీ



జిల్లాలో ఓటర్ల జాబితా సవరణను అత్యంత హేతుబద్ధంగా చేపడుతున్నాం. తప్పుల్లేని, పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు తీసుకుంటున్నాం. పది మందికి పైగా ఓటర్లు ఉన్న ఇళ్లను క్షేత్ర స్థాయిలో ఆయా మండలాల తహసీల్దార్లు స్వయంగా పరిశీలిస్తారు. 17 ఏళ్లు పైబడిన వారికి, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరికీ ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం. కొత్త ఓట్లతో పాటు ఓటు హక్కు లేని వారు, నియోజకవర్గం మారిన వారు తప్పనిసరిగా ఓట్లు నమోదు చేయించుకోవాలి.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

చిరు వ్యాపారులకు తోడుగా...



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

- జగనన్న తోడు పథకం నిధుల విడుదల
- 19,232 మందికి రూ.20.71 కోట్ల జమ

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): చిరు వ్యాపారులకు చేయూతనందించడానికి ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకం కింద జిల్లాకు చెందిన 19,232 లబ్ధిదారులకు రూ.20.71 కోట్లు జమ చేసినట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జగనన్న తోడు 7వ విడత నిధులు, జగనన్న తోడు 5వ విడత వడ్డీ రాయితీ కార్యక్రమాన్ని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, జగనన్న తోడు పథకం ద్వారా చిరు వ్యాపారులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. తొలి విడతలో అందించిన రూ.10 వేలను క్రమంగా పెంచుతూ నేడు రూ.11 వేల నుంచి రూ.13 వేల వరకూ అందజేస్తున్నారని చెప్పారు. 92 శాతం పైబడి జగనన్న తోడు రుణాలను లబ్ధిదారులు సకాలంలో చెల్లిస్తున్నారన్నారు. సకాలంలో చెల్లించిన వారికి ప్రభుత్వం నేరుగా వడ్డీ రాయితీ జమ చేస్తోందని చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ, వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడుతున్న చిరు వ్యాపారులు, చేతి వృత్తుల వారి కష్టాలను దగ్గరగా చూసిన సీఎం జగన్, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో జగనన్న తోడు పథకాన్ని తీసుకువచ్చారని అన్నారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ, జగనన్న తోడు స్ఫూర్తిమంతమైన పథకమని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, డీపీఎం గణేష్, జెడ్ఎస్ ట్రెజరర్ లక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న తోడు లబ్ధి ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	రూ.నగదు (రూ.కోట్లలో)
అనపర్తి	1,845	1.98
గోపాలపురం	2,005	2.26
కొవ్వూరు	3,228	2.51
నిడదవోలు	2,628	2.83
రాజమహేంద్రవరం రూరల్	2,532	2.73
రాజమహేంద్రవరం అర్బన్	4,707	5.07
రాజానగరం	2,468	2.66
జగ్గంపేట (గోకవరం)	629	6.77

ఆర్థిక భరోసా



గతంలో వ్యాపారం కోసం డబ్బులు అప్పు ఇవ్వమంటే హామీ ఏమిటని అడిగేవారు. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన జగనన్న తోడు ద్వారా పెట్టుబడి సాయం అందుతోంది. ధైర్యంగా అప్పు తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నాను. ఆర్థికంగా భరోసా లభించడంతో ఈ రోజు ఇలా గౌరవంగా బతుకుతున్నాను.

– నేతి నాగమణి

స్వయం ఉపాధి



2020లో కుట్టు మెషీన్ ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నా. నా దగ్గరకు వలంటీర్ వచ్చి జగనన్న తోడు పథకం గురించి వివరించారు. ఆ పథకానికి దరఖాస్తు చేయించారు. ఆ సొమ్ముతో చిన్నగా దుస్తుల వ్యాపారం ప్రారంభించాను. రెండో విడతలో రూ.11 వేలు మంజూరు చేస్తే ఆ సొమ్ముతో ఇంకో మెషీన్ తీసుకుని మా చుట్టాలమ్మాయికి కూడా ఉపాధి అవకాశం కల్పించే స్థాయికి చేరుకున్నాను.

– కె.భవాని, మోరంపూడి

ఓటర్ల జాబితా సవరణకు పక్కాగా ఏర్పాట్లు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఓటర్ల జాబితా సవరణకు పక్కాగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వెలగపూడి నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణపై ఇప్పటికే మూడుసార్లు జిల్లా, పలుమార్లు డివిజన్, మండల స్థాయిల్లో సమావేశాలు నిర్వహించామని చెప్పారు. డివిజన్ స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. జిల్లాలో ప్రతి 1000 మంది పురుషులకు 1039 మంది మహిళా ఓటర్లున్నారని కలెక్టర్ తెలిపారు. ఫారం–6, 6ఎ, 7, 8లకు సంబంధించి 21,576 దరఖాస్తులు రాగా, 11,535 ఆమోదించామని, 1,211 తిరస్కరించామని, 8,148 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకూ కొత్తగా 12,525 ఓటర్లు నమోదు కాగా, 12,171 మందిని తొలగించామని తెలిపారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ పీడీఎస్ బియ్యంతో సివిల్ సప్లయి అధికారులు

రాజానగరం: అనధికారికంగా తరలిస్తున్న 23.5 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని రాజానగరంలో జాతీయ రహదారిపై పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. లారీతో సహా పట్టుబడిన బియ్యం విలువ రూ.17.40 లక్షలు ఉంటుందని అంచనా. రాజానగరం ఎంఎస్ఓ కమల్‌సుందర్ మంగళవారం ఇక్కడ విలేకరులకు తెలిపిన వివరాలిలావున్నాయి.. దొరికిన బిల్లులో ఉన్న వివరాల ప్రకారం తిరువూరులోని కుమార్ ట్రేడర్స్ నుంచి కాకినాడ పోర్టుకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. పట్టుబడిన బియ్యాన్ని గోడౌన్‌కి తరలించి, లారీని సీజ్ చేశారు. నిందితులు నాయుడు, లారీ ఓనర్ కమ్ డ్రైవర్ శ్రీహరి, డ్రైవర్ సోంబాబు, పోర్టుకు చెందిన శివపై 6 ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడిలో తహసీల్దారు పవన్‌కుమార్, వీఆర్వో పాపారావు పాల్గొన్నారు.

దర్యాప్తు ముమ్మరం

మహిళ మర్డర్, ఆటోడ్రైవర్ హత్యాయత్నం కేసుల ఛేదనకు ఐదు బృందాల ఏర్పాటు

తుని రూరల్: జిల్లాలో తీవ్ర కలకలం రేపిన మహిళ మర్డర్ కేసును పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరు జంక్షన్‌లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న టిఫిన్ సెంటర్లో పప్పు సత్యవతి (55) హత్య, ఆటోడ్రైవర్ దమ్ము దుర్గారావుపై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. వేర్వేరుగా నమోదు చేసిన ఈ కేసులను ఛేదించి, దుండగులను పట్టుకునేందుకు కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐదు ప్రత్యేక బృందాలను నియమించారు. అందులో నాలుగు బృందాలు జిల్లావ్యాప్తంగా దర్యాప్తు చేస్తున్నాయి. సీసీ ఫుటేజీల పరిశీలిస్తున్నారు. లాడ్జీలు తనిఖీ చేస్తున్నారు. సమీపంలో ఉన్న వివిధ ఫ్యాక్టరీలలో పనులకు వచ్చి ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడి ఉండవచ్చన్న అనుమానితుల కదలికలను పరిశీలిస్తున్నారు. రూరల్ ఎస్సై విజయబాబు ఆధ్వర్యంలో ఎస్సై, ఆరుగురు కానిస్టేబుళ్లు మంగళవారం దర్యాప్తు నిమిత్తం ఒడిశా బయలుదేరి వెళ్లారు.

రత్నగిరిపై డిజి డల్

- ఆలయ కౌంటర్లలో ఫోన్ పే వంటి చెల్లింపులకు అవకాశం లేని వైనం
- డిజిటల్ పేమెంట్స్ సౌకర్యం లేక భక్తులకు ఇబ్బంది
- ప్రైవేటు షాపులు, క్యాంటీన్లలోనే లభ్యం



సత్యదేవుని వ్రతాల టిక్కెట్లు విక్రయించే బుకింగ్ కాంప్లెక్స్

అన్నవరం: ఇప్పుడు ఎక్కడ చూసినా ...ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే..పేటీఎం వంటి వాటి ద్వారా నగదు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్ ఉన్న బోర్డులు దర్శనమిస్తున్న విషయం తెలిసిందే. జేబులో రూపాయి లేకపోయినా ఫోన్‌లో ఆ యాప్‌లు ఉండి బ్యాంక్ అకౌంట్ లో నగదు ఉంటే చాలు వాటి ద్వారా పేమెంట్ చేసేయొచ్చు. క్యూఆర్ కోడ్ లేకపోతే ఫోన్ నంబర్లు దర్శనమిస్తాయి. కావల్సినవి కొనుక్కుని ఎటువంటి శ్రమ లేకుండా చెల్లింపులు చేసేయొచ్చు.

రత్నగిరిపై నో ఫోన్ పే... నో గూగుల్ పే...

నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేసే అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మాత్రం ఈ విధమైన సదుపాయం లేక భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్వామివారి వ్రతం, దర్శనం, ప్రసాదం టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు, వసతి గదుల కోసం రుసుం చెల్లించేందుకు ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే, తదితర డిజిటల్ ఆప్స్ ద్వారా పేమెంట్ చేసేందుకు వీలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ చెల్లింపునకు నగదు మాత్రమే చెల్లించాల్సి రావడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రెడిట్, డెబిట్ కార్డులను కూడా దేవస్థానం అంగీకరించడం లేదు. భక్తులు నగదు విత్‌డ్రా చేయడానికి ఏటీఎం లను ఆశ్రయించినా అక్కడ కూడా నగదు నిల్వ లేదన్న సమాధానంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రోజు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం

రత్నగిరికి ప్రతీ రోజు సుమారు పది వేల నుంచి 50 వేల మంది వరకు భక్తులు వస్తారు. పర్వదినాలలో అయితే ఈ సంఖ్య లక్ష దాటుతుంది. భక్తుల ద్వారా దేవస్థానానికి ఆదాయం కూడా రూ.20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు, పర్వదినాలలో అయితే రూ. కోటి వరకు కూడా ఉంటుంది. అంతా కూడా నగదు వ్యవహారాలే కావడంతో సిబ్బంది లెక్కింపు కూడా ఇబ్బందిగా మారుతోంది.

డిజిటల్ పేమెంట్ చేయవచ్చని తక్కువ నగదుతో రత్నగిరికి వస్తున్న భక్తులు

డిజిటల్ పేమెంట్స్ సర్వసాధారణం అయిన ప్రస్తుత పరిస్థితిలో డిజిటల్ పేమెంట్స్ చేయవచ్చనే ఉద్దేశంతో భక్తులు తక్కువ నగదుతో స్వామివారి ఆలయానికి వస్తున్నారు. ఇక్కడకు వచ్చాక దేవస్థానం నిర్వహించే ప్రతీ కౌంటర్‌లో నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఉండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అదే సమయంలో దేవస్థానంలోని ప్రయివేట్ షాపులు, క్యాంటీన్ నిర్వాహకులు మాత్రం డిజిటల్ పేమెంట్స్‌ను అంగీకరిస్తున్నారు. దీంతో భక్తులు వారిని నగదు ఇవ్వండి మీకు ఫోన్ పే ద్వారా పంపిస్తామని బతిమాలుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. అలా దేవస్థానానికి వచ్చిన భక్తులందరికీ నగదు సర్దుబాటు చేసే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు. అందువల్ల వెంటనే డిజిటల్ పేమెంట్స్ కు ఏర్పాట్లు చేయాలని, దేవస్థానంలోని మూడు ఏటీఎంలలో సరిపడా నగదు ఎల్లప్పుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



బాలయోగి స్టేడియంలో అధికారులతో కలసి పర్యటిస్తున్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్

సీఎం జగన్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్ ఆదేశం

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన అమలాపురం రానున్న నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, జిల్లా అధికారులను ఆదేశించారు.

ఆరోజు స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరగనున్న కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ రాయితీ నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేయనున్నారు. మంగళవారం స్టేడియంను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వేదిక అలంకరణ, బారికేడ్లు, వీఐపీ, ప్రెస్ గ్యాలరీల ఏర్పాటుకు సంబంధించి రహదారులు భవనాల శాఖ అధికారులకు సూచనలు ఇచ్చారు. మహిళా సంఘాలు కొబ్బరి విలువ ఆధారితంగా నెలకొల్పిన పరిశ్రమలకు సంబంధించి ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్‌ను ఆదేశించారు. స్టేడియం ఆవరణ చదును చేయడాన్ని, వీఐపీలు, డ్వాక్రా సంఘాల మహిళలు వేదిక వద్దకు వచ్చి, వెళ్లే మార్గాలను ఆయన నిశితంగా పరిశీలించి ఆ దిశగా ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఆదేశించారు. డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, డీఎస్పీ అంబికా ప్రసాద్, ఆర్డీవో వసంతరాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, పంచాయతీరాజ్ గ్రామీణ నీటి సరఫరా విభాగం, పారిశుద్ధ్య శాఖ ఎస్ఈలు చంటిబాబు సీహెచ్ఎన్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, పీఆర్ డీఈఈ రాజకుమార్, తహసీల్దార్ శ్రీపల్లవి, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి: ఏపీ అసెంబ్లీ నైతిక విలువల కమిటీ (ఎథిక్స్) సభ్యుడిగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. పలు అసెంబ్లీ కమిటీలు, జాయింట్ కమిటీలను ఏర్పాటు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి ఈ నెల 17న ఉత్తర్వులు విడుదల చేయగా వీటిలో అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా తనను నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి స్త్రీ, శిశు, వికలాంగ, వృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యుడుగాను కొనసాగుతున్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిలిచే ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ఆయన వ్యక్తిత్వానికి సరిపడే రీతిలో ఏపీ అసెంబ్లీ నైతిక విలువల కమిటీ సభ్యుడిగా నియమితులు కావడంపై నియోజకవర్గ పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యేకు మంగళవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహం వద్ద పౌరసన్మానం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాలకు చెందిన అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తరలివచ్చి ఎమ్మెల్యేను అభినందనలతో ముంచెత్తారు. పూల కిరీటం, గజమాలలు, దుశ్శాలువాలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

విలవిల్లాడిన విశ్వాసం

- యువతిని వెంబడించిన పెంపుడు శునకం..
- చూస్తుండగానే గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ కాంచన
- ఆమె విడిచిన చెప్పుల వద్దే రాత్రంతా.. వేచి చూసిన వైనం



ఆత్మహత్యకు పాల్పడ్డ కాంచన (ఫైల్)

యానాం: 'మూడురోజులు ఒక కుక్కకు అన్నం పెట్టి చూడండి.. అది మూడు సంవత్సరాలైనా మీపై విశ్వాసం చూపిస్తుంది. అదే ఒక మనిషికి మూడు సంవత్సరాలు అన్నం పెట్టి చూడండి.. వాడు మీపై విశ్వాసాన్ని మూడు రోజుల్లోనే మరిచిపోతాడు' అంటారు పెద్దలు. ఆవిధంగా కుక్క విశ్వాసానికి నిదర్శనంగా జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అది కాస్తా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే యానాం పట్టణ పరిధిలోని ఫెర్రీరోడ్డులో నివాసం ఉంటున్న మందంగి కాంచన అనే యువతి ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి ఒక కిలోమీటర్ దూరంలోని యానాం–ఎదుర్లంక బ్రిడ్జిపైకి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆమె వెంట ఆమె అల్లారుముద్దుగా పెంచుకునే పెంపుడు కుక్క సైతం ఆమెను వెంబడించింది. ఆవిధంగా పెంపుడు శునకం సైతం బ్రిడ్జి పైన వాక్‌వే వద్దకు 8వ నంబరు పిల్లరు ప్రాంతానికి చేరుకుంది. ఇంతలోనే కుక్క చూస్తుండగానే కాంచన తన చెప్పులను, సెల్‌ఫోన్‌ను అక్కడే విడిచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనను చూసిన కుక్క అక్కడే తచ్చాడుతూ అరుస్తూ చెప్పుల వద్దే ఉండిపోయింది. అటుగా వెళుతున్న వాహన చోదకులు ఆగి.. కుక్క అక్కడే ఉండటం, చెప్పులు సైతం ఉండటంతో ఎవరో ఆత్మహత్య చేసుకుని ఉంటారని అనుమానించి పోలీసులకు తెలిపారు. అప్పటికే రాజీవ్ బీచ్ ప్రాంతంలోని పలువురు కాంచన దూకడాన్ని చూశారు. దీంతో స్థానిక మత్స్యకారులు ఆమె ఆచూకీ కోసం గాలించారు. అయితే రాత్రి ఒంటిగంట వరకు కాంచన వస్తుందని పెంపుడు కుక్క చెప్పుల వద్దే దీనంగా ఉండటం అందరిని కలచివేసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంచన బంధువులు కుక్కను తిరిగి ఇంటివద్దకు తీసుకువచ్చారు. ఆమె పట్ల కుక్క విశ్వాసాన్ని, ప్రేమను పలువురు గొప్పగా చెబుతున్నారు. కాని కాంచన ఎన్నటికీ తిరిగి రాదన్న చేదునిజం పాపం ఆ కుక్కకు తెలియదు కదా!



యానాం–ఎదుర్లంక బిడ్జిపై నుంచి కాంచన కోసం గోదావరిలోకి చూస్తున్న ఆమె పెంపుడు కుక్క

మృతదేహం లభ్యం

యానాం–ఎదుర్లంక బాలయోగి వారధి పై నుంచి ఆదివారం రాత్రి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ యువతి కాంచన(22) మృతదేహం మంగళవారం లభ్యమైంది. కనకాలపేట పుష్కరఘాట్ సమీపంలో కాంచన మృతదేహం గాలిస్తున్న మత్స్యకారులకు కనిపించింది. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: పట్టణంలో వేములూరు రైల్వే గేటు వద్ద రైలు పట్టాలపై తలపెట్టి ఓ గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకుని దుర్మరణం పాలయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో హాటియా నుంచి ఎర్నాకుళం వెళుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపారు. తల, మొండెం వేర్వేరు అయ్యాయి. తలభాగం ఒక వైపు పూర్తిగా దెబ్బతింది. రైలు ఢీకొట్టిన సమయంలో యువకుడి ఒంటిపై ఉన్న దుస్తులను సైతం రైలు లాక్కుని వెళ్లి పోయింది. మృతుడి వద్ద ఏవిధమైన వివరాలు లభ్యం కాలేదన్నారు. సుమారు ఇరవై నుంచి ఇరవై ఐదేళ్ల వయస్సు ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. వివరాల కోసం 94909 70541 నంబర్‌కి కాల్ చేయాలని ఆయన సూచించారు.

ద్వారపూడిలో..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): 30 పురుషుడు ద్వారపూడి యార్డ్ డౌన్ లైన్ రైల్వే ట్రాక్ మధ్యన మంగళవారం చనిపోయి ఉన్నాడు. బ్లాక్ రంగు టీ షర్టు, పసుపు రంగు గల హాండ్స్, బ్లూ కలర్ జీన్ ఫాంట్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై సినీ హీరో పవన్ కళ్యాణ్ ఫొటో పచ్చబొట్టు, కుడి చేతిపై అమ్మ అనే పేరు పచ్చ బొట్టు ఉంది. అతడిని గుర్తు పట్టడానికి ఎటువంటి ఆధారాలు లభించలేదని జీఆర్పీ పోలీస్‌లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 0883 2442821, 9441238640 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

30 వరకు లక్ష్మీహ్యుండాయ్ స్పెషల్ మాన్సూన్ చెకప్ క్యాంప్‌లు



మాన్సూన్ చెకప్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న బిల్డర్ మార్కండేయరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం లక్ష్మీ హ్యుండాయ్ స్పెషల్ మాన్సూన్ చెకప్ క్యాంప్‌లు ఈ నెల 30వ తేదీ వరకు లాలాచెరువు, బొమ్మూరు వర్కుషాప్‌లలో స్పెషల్ ఆఫర్స్‌తో నిర్వహిస్తున్నట్లు సంస్థ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపును హ్యుండాయ్ కస్టమర్, బిల్డర్ మార్కండేయరెడ్డి లాంఛనంగా ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ క్యాంప్ ప్రత్యేకతలను వివరించారు. 50 పాయింట్స్ ఫ్రీ–చెకప్, బ్రేక్‌పాడ్స్, బ్రేక్‌డిస్క్, హెడ్‌ల్యాంప్, టైల్‌ల్యాంప్, వైపర్లపై 10శాతం డిస్కౌంట్, మెకానికల్ లేబర్, పీరియాడికల్ సర్వీసెస్‌పై 10శాతం డిస్కౌంట్, అండర్‌బాడీ (యాంటీరెస్ట్) కోటింగ్, విండ్‌స్క్రీన్ ట్రీట్మెంట్, ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్‌లపై 10శాతం డిస్కౌంట్, ఆర్ఎస్ఏ రిటైల్‌పై 20శాతం డిస్కౌంట్ వంటి ప్రత్యేకమైన ఆఫర్స్‌తో క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని హ్యుండాయ్ కస్టమర్స్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. హ్యుండాయ్ స్టాఫ్ కృష్ణమోహన్, పవన్‌కుమార్, దుర్గ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువుల స్వాధీనం

సుమారు రూ. రెండు లక్షల విలువైన సరకు గుర్తింపు

పెద్దాపురం: స్థానిక ఏడీబీ రోడ్డులోని యార్లగడ్డ గార్డెన్స్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువుల బస్తాలపై పెద్దాపురం పోలీసులకు అందిన సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించారు. నిమ్మతోటలో నిల్వ ఉంచిన 271 బస్తాలను సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ సురేష్ గుర్తించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ దైవకుమార్‌కు సమాచారం అందించారు. బస్తాల్లో ఉన్నది అమ్మోనియా సల్ఫేట్‌గా స్థానికులు గుర్తించారని, దీని విలువ సుమారు రెండు లక్షల రూపాయలు ఉంటుందన్నారు. బస్తాల్లో ఉన్న ఎరువును ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపిస్తామని నివేదిక అనంతరం బస్తాల్లో ఉన్న ఎరువు అమ్మోనియా సల్ఫేటా లేక వేరే ఏదైనా ఎరువా అనేది నిర్ధారణ అవుతుందని ఏడీఏ దైవకుమార్ తెలిపారు. బస్తాలు మావి అంటూ ఏ ఒక్కరూ రాలేదని, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసుల సమక్షంలో బస్తాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ మృతి



మృతిచెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వరరావు

నల్లజర్ల: పట్టణ శివారులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టరు డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లజర్ల ఎస్ఐ నరసింహమూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నబీపేట గ్రామానికి చెందిన ట్రాక్టరు డ్రైవర్ చెవల వెంకటేశ్వరరావు(52) మంగళవారం మధ్యాహ్నం పామాయిల్ గెలలు వేసుకొని నల్లజర్ల కాటా వద్దకు వస్తుండగా ట్రాక్టరు మట్టిగుట్ట ఎక్కి పక్కకు పడిపోయింది. కిందపడ్డ డ్రైవర్ వెంకటేశ్వరరావుపై ట్రక్కుచక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2.40 లక్షల విలువైన ఆభరణాల చోరీ



కపిలేశ్వరపురంలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్‌టీం

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన గరగపాటి వెంకటరావు, సూర్యకుమారి దంపతుల నివాసంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.2,40,000 విలువైన బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు. అంగర ఎస్సై జి.చంటి కథనం ప్రకారం... వెంకట్రావు, సూర్యకుమారి దంపతులు ఈ నెల 7న హైదరాబాద్ వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చి చూడగా వారి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. బీరువాలో భద్రపర్చుకున్న 60 గ్రాముల బంగారు ఆభరణాలు, నాలుగు కేజీల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్ పర్యవేక్షణలో అంగర పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారి సమాచారం మేరకు జిల్లా క్రైం సీఐ డి.గోవిందరావు, అమలాపురం జిల్లా క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై అంగర ఎస్సై జి.చంటి కేసును నమోదు చేశారు.

రాజకీయాల కోసం విభేదాలు సృష్టించవద్దు

- ఇది మా జాతి సమస్య.. మేమే పరిష్కరించుకుంటాం
- ముచ్చుమిల్లి ఘటనపై మాదిగ సంఘం నాయకులు



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాదిగ సంఘం నాయకులు

రామచంద్రపురం: ఈ నెల 17న ముచ్చుమిల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జరిగిన ఘటన ఇద్దరి స్నేహితుల మధ్య జరిగిన వ్యక్తిగత వివాదమని, మా జాతిలోని వ్యక్తిగత విభేదాలను రాజకీయాలకు వాడుకోవటం తగదని మాదిగ సంఘం నాయకులు స్పష్టం చేశారు. ముచ్చుమిల్లిలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ వివాదంపై మాదిగ సంఘం నాయకులు మంగళవారం స్పందించారు. ముచ్చుమిల్లిలో జరిగిన ఘటనను రాజకీయం చేయడాన్ని ఖండిస్తూ వారు మున్సిపల్ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ ఘటన బాధాకరమన్నారు. కోలమూరి శివాజీ, జుత్తుక ఉదయ్ కుమార్ మంచి స్నేహితులని, వ్యక్తిగత కారణాలతో జరిగిన ఘటనను రాజకీయాలకు వాడుకోవాడాన్ని తమ సంఘం తరుపు ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనను మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు, వైఎస్సార్ సీపీకి ముడిపెట్టడం సరికాదన్నారు. మున్సిపాలిటీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన కోలమూరి శివాజీకి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఇచ్చిన మంత్రి వేణుపై ఈ విధంగా బురద జల్లడాన్ని ఖండిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమస్యను కుల పెద్దల నేతృత్వంలో పరిష్కరించుకుంటామని గొడవలు సృష్టిస్తే సహించేది లేదన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు కొమ్ము సురేష్, మందపల్లి చిట్టిబాబు, దొమ్మలపాటి లాలిప్రసాద్, పిల్ల వెంకన్న, మందపల్లి నానిబాబు, లక్క రమణ, మీనా మీడియాతో మాట్లాడారు.

మా డబ్బు త్వరగా ఇప్పించండి

కార్తికేయ బాధితుల ఆవేదన



సభలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జ్ దుర్గాప్రసాద్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మా డబ్బు మాకు వీలైనంత త్వరగా ఇప్పించాలని కార్తికేయ కో– ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఖాతాదారులు సహకార అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు. ఖాతాదారులు నుంచి భారీగా డిపాజిట్లు వసూలు చేసి ఇటీవల బోర్డు తిప్పేసిన కార్తికేయ కో – ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభ మంగళవారం కాకినాడలో సహకార శ్రీనిలయంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ పి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీలో జరిగిన ఆర్థిక అవకతవకలపై సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం చేపట్టిన విచారణలో సుమారు రూ.21 కోట్ల మేర అవినీతి జరిగినట్లు వెల్లడైందన్నారు. ఖాతాదారులు వేసిన డిపాజిట్లు రికార్డులు ఎక్కడా చూపలేదన్నారు. సొసైటీ ఆడిట్ ప్రయివేటుగా చేయించడం వల్ల అవినీతి జరిగినా తమ దృష్టికి రాలేదన్నారు. సొసైటీ ఆస్తులు అటాచ్ చేశామన్నారు. అవినీతికి పాల్పడ్డ వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సొసైటీ విచారణ అధికారి ఎన్ వీఎస్ఎస్ ఆర్‌కే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

లభ్యం కాని వైద్య విద్యార్థి ఆచూకీ

ఆలమూరు: జార్జియా దేశంలో అదృశ్యమైన వైద్య విద్యార్థి సిడగం హేమంత్ అశ్విన్ ఆకాష్ (21) ఆచూకీ ఇంకా లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో జిల్లాస్థాయి అధికారులు ఇప్పటికే జార్జియాలోని విదేశాంగ మంత్రిత్వ శాఖను సంప్రదించారు. దీంతో వైద్య విద్యార్థి చదువుతున్న జార్జియాలోని ఇల్లియా స్టేట్ గవర్నమెంట్ మెడికల్ యూనివర్సిటీ ఫిర్యాదు మేరకు అక్కడి ప్రభుత్వం కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తండ్రి సత్యనారాయణ (నాయుడు) తెలిపారు. కొంతమంది స్నేహితులు ఇచ్చిన సమాచారం మేరకు సమీప బీచ్‌లో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడా అనే కోణంలో కోస్టుగార్డు గాలింపు చర్యలు చేపట్టిందన్నారు.